కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో ..టమాట-20, పచ్చిమిర్చి-50, బెండకాయ-40, కాకరకాయ-50, దొండకాయ-30, దోస-40, ఆలు-30, చామ60,కీర-40,బీర60, వంకాయ-40, గోకరకాయ-60, బీన్స్-100, బీట్‌రూట్-40, క్యాప్సికమ్-60, క్యాబేజీ-20, క్యారెట్ 40, చిక్కుడు-100, ఉల్లి-25(కేజీ) ములక్కాయలు(2)-10, సొరకాయ-20 కేజీ, అల్లం-70, వెల్లుల్లి-150.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ క్యాంపస్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం నిర్వహిస్తారు.సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది. ఈ సందర్భంగా 'ట్రిపుల్ ఫిల్టర్ టెస్ట్' అనే అంశంపై బ్రహ్మకుమారీస్ కోకాపేట్ బ్రాంచ్ కోఆర్డినేటర్, సీనియర్ రాజయోగ టీచర్ బి.కె.రుచి ఉపన్యసిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



మదీనాగూడలోని ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

చందానగర్: శేరిలింగంపల్లి మండలంలోని మదీనాగూడ సర్వే నంబర్- 75 ప్రభుత్వ స్థలంలోని 160 గజాల స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో శనివారం మండలం రెవెన్యూ అధికారి శ్రీనివాస్ నేతృత్వంలో కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల తహశీల్దార్ వెంకారెడ్డి ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను తొలగించామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉచిత వైద్యశిబిరం



కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం కాంటినెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, మేనేజర్ అఖిల్, ఆర్ఓ వెంకటరామయ్య పాల్గొన్నారు.

రాయసముద్రం చెరువును సందర్శించిన అధికారులు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని రాయసముద్రం చెరువును శనివారం హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ ఇరిగేషన్ అధికారులు సందర్శించారు. కార్పొరేటర్ పుష్ప మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం చెరువు అభివృద్ధి విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందించామన్నారు. అందులో భాగంగా అధికారులు రాయసముద్రం చెరువును సందర్శించారని, దుర్గం చెరువు తరహాలో ఈ చెరువును అభివృద్ధి చేస్తామని ఆమె వివరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ నళిని, హెచ్ఎండీఏ డీఈ జగన్‌మోహన్, స్థానికులు చంద్రశేఖర్‌గుప్తా, వాసుదేవ్, చిగురు శ్రీనివాస్, యాదయ్య, గోపాలకృష్ణ, మోహన్‌రెడ్డి, భుజంగారెడ్డి, సహదేవ్‌గౌడ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



రవికుమార్(ఫైల్)

గచ్చిబౌలి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. రాయదుర్గం ఎండ్లబస్తీకి చెందిన ఎండ్ల రవికుమార్(26) ఓ కంపెనీలో ఆఫీస్ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 22న హోండా యాక్టివాపై లింగంపల్లి నుంచి రాయదుర్గం వైపు వస్తుండగా ఉదయం 6.30 గంటల సమయంలో హెచ్‌సీయూ ద్వారం ఎదురుగా ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో రవికుమార్ తలకు తీవ్ర గాయాలు కావడంతో కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కోమాలోకి వెళ్లడంతో మెరుగైన చికిత్స నిమిత్తం మదీనాగూడలోని శ్రీకర్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం 8 గంటలకు మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హెచ్‌సీయూ విద్యా కుసుమాలు

అన్నిరంగాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులు

పేరు నిలబెడుతున్నారంటూ ప్రొఫెసర్ల హర్షం

రాయదుర్గం: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిన గచ్చిబౌలి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు తమ సత్తా చాటుతున్నారు. ఉన్నత ఉద్యోగాలు, ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు. విద్యాసంస్థ పేరు మారుమోగేలా చేస్తున్నారని పలువురు ప్రొఫెసర్లు వ్యాఖ్యానిస్తున్నారు. ఇటీవలి కాలంలో ఉన్నత ఉద్యోగాలు సాధించిన వారిని పరిశీలిస్తే...


సౌరవ్‌కుమార్ సిన్హాకు రూ.2 కోట్ల బిజినెస్ స్కూల్ స్టూడెంట్‌షిప్-2025



హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి సౌరవ్‌కుమార్‌సిన్హాకు సుమారు 2 కోట్లు (230,000 యూఎస్ డాలర్లు) విలువైన ప్రతిష్టాత్మకమైన అలయన్స్ మాంచెస్టర్ బిజినెస్ స్కూల్ స్టూడెంట్‌షిప్-2025 లభించింది. ఈ విజయం సౌరవ్ విద్యా నైపుణ్యం, పరిశోధనా సామర్థ్యం, తన రంగానికి అంకిత భావానికి నిదర్శనంగా చెప్పవచ్చు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లోని హిస్టరీ విభాగంలోని అధ్యాపక బృందం మద్దతుతో ఇది సాధించేందుకు అవకాశం కలిగింది. ఆయన ఎంఏ హిస్టరీ 2022-24 బ్యాచ్‌కు చెందిన వారు.సౌరవ్ వ్యాపారం, నిర్వహణలో నాలుగు సంవత్సరాల పీహెచ్‌డీ కోర్సును అభ్యసించడం ఆరంభించారు.తన మాస్టర్స్ డిసర్టేషన్ సూపర్‌వైజర్ డాక్టర్ విజయ రామదాసు మండలా, ప్రొఫెసర్ సుచంద్రఘోష్, డాక్టర్ వీజే వర్గీస్, ప్రొఫెసర్ భంగ్యా భూక్య, ప్రొఫెసర్ ఈశ్వరరావు అభినందించారు. ఇటీవలే ఆయన ఐఐఎం అహ్మదాబాద్‌లో ప్రొఫెసర్ చిన్మయ్ తుంబే మార్గదర్శకత్వంలో రీసెర్చ్ అసోసియేట్‌గా పనిచేశారు. చరిత్రలో ఎంఏ పూర్తి చేయడంలో పదికి 8.62 జీపీఏ(డిస్టింక్షన్ గ్రేడ్) సాధించడం విశేషం.

పుస్తక రచయితగా..





హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి డా. మెండమ్ బాపూజీ, కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లోని లింగ్విస్టిక్ రీసెర్చ్ యూనిట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. హెచ్‌సీయూ సెంటర్ ఫర్ అప్‌లైడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ మాజీ ఫ్యాకల్టీ సభ్యుడు ప్రొఫెసర్ పంచానన్ మహంతితో కలిసి రచించారు. ఆయన నగరంలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో గౌరవ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. డాక్టర్ మెండమ్ బాపూజీ హెచ్‌సీయూ నుంచి ఎంఫిల్‌ను 2008-2010లో, అప్‌లైడ్ లింగ్విస్టిక్స్‌లో పీహెచ్‌డీని 2010-2019లో పొందారు. ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో 10వేల కంటే తక్కువ మంది మాట్లాడేవారు. ద్రావిడ భాష అయిన ఒల్లారి గడాబా యొక్క సమగ్ర వ్యాకరణ విశ్లేషణను అందిస్తుంది. ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలోని పొట్టంగి, సెమిలిగుడ, నందపూర్ బ్లాక్‌లలో జరిగిన సమగ్ర పరిశోధన ఆధారంగా ఈ వ్యాకరణం రూపొందించబడింది.ఇది భాష యొక్క ధ్వనిశాస్త్రం, పద నిర్మాణం, ప్రాథమిక వాక్య నిర్మాణం కన్వర్జెన్స్ లక్షణాలను కవర్ చేస్తుంది.

సీఎస్ఐఆర్ న్యూఢిల్లీ సైంటిస్ట్, బిజినెస్ డెవలప్‌మెంట్ గ్రూప్ హెడ్‌గా డాక్టర్ శైలజ దోనేపూడి



సీఎస్ఐఆర్ న్యూఢిల్లీలో విశిష్ట సైంటిస్ట్, బిజినెస్ డెవలప్‌మెంట్ గ్రూప్ హెడ్‌గా హెచ్‌సీయూ పూర్వ విద్యార్థిని డాక్టర్ శైలజ దోనేపూడి ఉన్నారు. ఆమె హెచ్‌సీయూ కెమిస్ట్రీ విభాగంలో ఎంఎస్సీ (1986లో), కెమిస్ట్రీ ఎంఫిల్(1987లో) చదివారు. తర్వాత ఆమె 1993లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పాలిమర్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేశారు. అదే ఏడాది సీఎస్ఐఆర్-ఐఐసీటీలో సైంటిస్ట్-బిగా చేశారు. గత మూడు దశాబ్దాలుగా డాక్టర్ శైలజ పాలిమర్ సంశ్లేషణ, క్యారెక్టరైజేషన్ రంగంలో తన కంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకున్నారు. అత్యాధునిక పరిశోధన, వాస్తవ-ప్రపంచ అనువర్తనాలకు వారధిగా నిలిచే ప్రభావంతమైన పనితో నాలుగు పీహెచ్‌డీలను పర్యవేక్షించారు. అంతేకాకుండా 25 మంది మాస్టర్స్ విద్యార్థులను కూడా పర్యవేక్షించారు. ప్రముఖ అంతర్జాతీయ జర్నల్స్‌లో 35కు పైగా పరిశోధనా పత్రాలు ప్రచురితమయ్యాయి. పలు అవార్డులను పొందారు.

యూపీఎస్‌సీ ర్యాంక్ 703 .. పూర్వ విద్యార్థిని నెస్రిన్ ఫాసిమ్



హెచ్‌సీయూ పూర్వ విద్యార్థిని నెస్రిన్ పి ఫాసిమ్ యూపీఎస్‌సీ ర్యాంక్ 703ను సాధించారు. 2024లో సివిల్ సర్వీసెస్‌లో 703 ర్యాంక్‌తో అర్హత సాధించారు.ఆమె స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి ఎంఏ ఎకనామిక్స్ 2020-22 బ్యాచ్ విద్యార్థిని. ఆమె తన బృందంలో ఎస్‌బీఐ గోల్డ్ మెడల్‌ను అందుకుంది. ఆర్థిక మంత్రిత్వశాఖలో ఆర్థిక వ్యవహారాల విభాగంలో ఇంటర్న్‌షిప్‌ను పొందారు. ఆర్థిక శాస్త్రంలో యూజీసీ జేఆర్ఎఫ్ డిసెంబర్-2023లో అర్హత సాధించారు.

అలరించిన నృత్యప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం డాక్టర్ వినీలరావు శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఇందులో గణేశ పంచరత్న, బ్రహ్మాంజలి, శివతాండవం, బృందావన నిలయే, రామాయణశబ్దం, జతిస్వరం, బాలగోపాల తారంగం, కొలువైతివా రంగసాయి, భోశంభో, దశావతారం తదితర అంశాలను కళాకారులు రుత్విజ, శాన్వి, వివేకా, సమ్రితి, ఆరాధ్య, సిరి, చందన, గౌతమి, శిరీష, రితిక, విశీత, సింధు, సాయి సరయు, వైష్ణవి, చరితకృష్ణ, స్రవంతి, దివ్య, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రద్ధ యలమర్తి సంగీత కచేరీతో సందర్శకులను అలరించారు. గణరాజ గణరాజ, తాళ్ళపాక అన్నమాచార్య, కొండ చూదము రారో, చిత్తము కొలది, వేడుకుందామా, పసిడి ఉయ్యాల అన్నమయ్య కీర్తనలను ఆలపించి ఆకట్టుకున్నారు. వీరికి కీ బోర్డుపై శ్రీనివాస్, తబలాపై అజయ్ సంగీత సహకారాన్ని అందించారు.





కవలలకు పునర్జన్మ

కొండాపూర్ కిమ్స్ వైద్యుల ఘనత



గచ్చిబౌలి: ఛత్తీస్‌ఘడ్‌లోని బిలాస్‌పూర్‌లో నెలలు నిండక ముందే కవలలు (మగ)1400 గ్రాములు, 1500 గ్రాముల బరువుతో జన్మించారు. ఇన్‌ఫెక్షన్ కారణంగా ప్లేట్‌లెట్లు పడిపోవడంతో ప్రాణాపాయ స్థితికి చేరడంతో ప్రత్యేక విమానంలో కొండాపూర్ కిమ్స్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. నియోనటాలజీ విభాగం క్లీనికల్ డైరెక్టర్, పీడియాట్రిక్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అపర్ణ చికిత్స వివరాలను వెల్లడించారు. రక్తంలో ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌తో పాటు డ్రగ్ రెసిస్టెంట్ బ్యాక్టీరియా (కెలబిసిల్లా) ఇన్‌ఫెక్షన్ కారణంగా అవయవాలు సరిగ్గా పని చేయడం లేదన్నారు. కిడ్నీలు పనిచేయక పోవడంతో మూత్ర విసర్జన 24 గంటలు జరగలేదని, ఫంగల్ సెప్సిస్ కావడంతో ముక్కు ద్వారా సిపిఏపీ ఇవ్వాల్సి వచ్చిందన్నారు. రక్తంతో పాటు ప్లేట్‌లెట్లు ఎక్కించామని పేర్కొన్నారు. నెల రోజుల పాటు చికిత్స అనంతరం తల్లి పాలు తాగుతున్నారని, బరువు 2000 గ్రాములకు చేరారని తెలిపారు. కొండాపూర్ కిమ్స్ కడల్స్ ఐసీఏటీటీ బృందం డాక్టర్లు రాజశేఖర్, వంశీ, అరవింద, ప్రణీత, సునీతలు చికిత్స అందించారన్నారు. పిల్లలను డిశ్చార్జి చేశామని తెలిపారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం



బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న సతీష్‌రావు, భాస్కర్‌రెడ్డి తదితరులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు ఆల్విన్‌కాలనీలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి గుడి ప్రాంగణంలో శనివారం బోర్‌వెల్ పనులను బీఆర్‌ఎస్ శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు, ఆలయ ధర్మకర్త శ్యామల భాస్కర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆలయంలో నూతనంగా చేపడుతున్న కళ్యాణ మండపం షెడ్డు, ఆలయ అభివృద్ధి కోసం తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని సతీష్‌రావు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్‌రెడ్డి, సమ్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, సాంబమూర్తి, ఎండి ఇస్మాయిల్, సాయిగౌడ్, శ్రీను పాల్గొన్నారు.

చెత్తను తొలగించారు.. వదిలేశారు

మియాపూర్: చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తి శ్రీనగర్ కాలనీలో దుర్గ ఎస్టేట్ పార్కు పక్కన వరద నీటి కాలువలో చెత్త, చెదారాన్ని తొలగించి అక్కడే వదిలేశారు. రోజులు గడుస్తున్నా చెత్తను తరలించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తిరిగి చెత్త కాలువలోకి చేరే అవకాశం ఉంది. దీంతో మురుగునీరు రోడ్లపైకి వస్తుందన్నారు. అధికారులు స్పందించి చెత్త చెదారాన్ని అక్కడ నుండి తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు



పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి/శేరిలింగంపల్లి/రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీలను ఆదర్శవంతంగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని టీఎన్‌జీఓ కాలనీలో రూ.4.89 కోట్లతో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు, నల్లగండ్ల హుడాకాలనీలో హిమసాయి టవర్స్ వరకు రూ.1.89 కోట్లతో చేపట్టే మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు, అలాగే శేరిలింగంపల్లి డివిజన్‌లోని శిల్పావ్యాలీ, మాధవహిల్స్‌కాలనీలో రూ.1.60 కోట్లతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యవసరం ఉన్న చోట, నిత్యం మురుగు పొంగుతున్న ప్రాంతాలలో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేసేలా నాలాల విస్తరణ పనులు చేపట్టామని, ఇవి పూర్తయితే రాబోయే రోజుల్లో డ్రైనేజీ సమస్య తలెత్తదన్నారు. శేరిలింగంపల్లి, గచ్చిబౌలి కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి, జలమండలి అధికారులు డీజీఎం సురేందర్‌రెడ్డి, మేనేజర్ సందీప్‌రెడ్డి, ఆయా కాలనీలవాసులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

విజేత సూపర్‌మార్కెట్ ప్రారంభం

మియాపూర్: డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ స్వర్ణపురి బాలాజీ నగర్ గ్రేటర్ ఇన్నా అపార్ట్‌మెంట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 116వ విజేత సూపర్ మార్కెట్ స్టోర్‌ను మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు మంచిసేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో విజేత సూపర్ మార్కెట్ డైరెక్టర్లు సందీప్, సిద్ధు, గ్రేటర్ ఇన్నా డైరెక్టర్ కెవిపి. ప్రసాద్‌రావు, రవి,శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 13 వద్ద ఆదివారం ధన్వి మల్టిస్పెషాలిటీ క్లినిక్స్, రిథమ్ స్పెషాలిటీ క్లినిక్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ధన్వి మల్టీస్పెషాలిటీ క్లినిక్స్ ఎండీ డాక్టర్ కె. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ ఆస్పత్రులలో పనిచేసే డాక్టర్‌లు ఈ శిబిరంలో పాల్గొని అన్ని రకాల పరీక్షలు నిర్వహించి మందులు, సలహాలను అందిస్తారన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. మున్సిపాలిటీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ సాబేర్ అలీ

నిజాంపేట్: ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కమిషనర్ సాబేర్ అలీ అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లోని 13, 14 డివిజన్‌లలో శనివారం పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చే ప్రతీ సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డితో, మున్సిపల్ సిబ్బంది కుమార్ యాదవ్, శ్రీశైలం యాదవ్, కాంగ్రెస్ ఎంసీ మహిళా అధ్యక్షురాలు ఇందిరా, లింగాల గంగాధర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మియాపూర్‌లో 'తిరంగా యాత్ర'



చందానగర్: ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సైన్యం విజయానికి మద్దతుగా సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ శేరిలింగంపల్లి అసెంబ్లీ ఆధ్వర్యంలో శనివారం 'తిరంగా యాత్ర' నిర్వహించారు. మియాపూర్ శివాలయం వద్ద ప్రారంభమై మైత్రీనగర్ కమాన్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, సినీ నటులు ఆర్ కె నాయుడు, బీజేపీ నాయకులు శేరిలింగంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు, రాష్ట్ర నాయకులు నరేష్, రవీందర్‌రావు, ప్రభాకర్ యాదవ్, కేశవ్‌రావు, నాగుల్‌గౌడ్, బోయిని అనూష మహేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్, జితేందర్, నాయకులు అనిల్‌గౌడ్, మాణిక్‌రావు, నర్సింగ్ యాదవ్ ,వివిధ సంఘాల నాయకులు, వ్యాపారవేత్తలు, బిల్డర్లు, న్యాయవాదులు, వైద్యులు పాల్గొన్నారు.

తులసివనం వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషా ముళ్లపూడి ప్రధాన రహదారిలో తులసివనం వద్ద ట్రాఫిక్ రద్దీతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని తులసివనం అపార్టుమెంట్ వాసులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకురాగా ఆయన ఎమ్మెల్యే గాంధీ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పీడ్ బ్రేకర్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. కార్యక్రమంలో ఎంఆర్‌కె రెడ్డి, శ్రావణ్‌కుమార్, నాగకృష్ణ, హరికిషోర్, తులసివనం అపార్టుమెంట్ వాసులు పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అవగాహన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద శనివారం అగ్నిమాపక దళం ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వంట గ్యాస్ లీకైన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలను రక్షించే విధానంపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక అధికారులు, నైబర్‌హుడ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్లు.. ఇరువైపులా పార్కింగ్

- అంబులెన్స్, ఫైరింజన్‌కు దారి ఏదీ?
- రోజూ గొడవలు.. స్థానికులకు ఇబ్బందులు



పాపిరెడ్డినగర్‌లో ఇళ్లముందు రోడ్డుకు ఇరువైపులా పార్క్ చేసిన కార్లు, ద్విచక్ర వాహనాలు



ఆల్విన్‌కాలనీ: అసలే ఇరుకు రోడ్లు.. ఆపై వాహనాల పార్కింగ్.. రోజూ వాహనదారుల వాగ్వాదాలు.. రోడ్డుకు ఇరువైపులా పార్క్ చేసిన వాహనాలతో చిన్నపాటి గొడవలతో మొదలై కొట్టుకునే పరిస్థితి నుంచి పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కేవరకూ సాగుతోంది. ఏదైనా అనారోగ్యం.. ప్రమాదాలు సంభవించినపుడు బస్తీ ప్రజల ఇక్కట్లు వర్ణణాతీతం.. అంబులెన్స్, ఫైర్ ఇంజన్ వంటి అత్యవసర వాహనాలు సైతం రాలేని పరిస్థితి. కూకట్‌పల్లి సర్కిల్, శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని జగద్గిరిగుట్ట పరిసర ప్రాంతాల్లోని పాపిరెడ్డినగర్, ప్రగతినగర్, రిక్షా పుల్లర్స్ కాలనీ, దీనబంధు కాలనీ వెంకటేశ్వరనగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ తదితర కాలనీలు, బస్తీల్లో ప్రణాళిక లేకుండా ఇష్టానుసారంగా .. జీహెచ్‌యంసీ అనుమతులు లేకుండా, పార్కింగ్ సౌకర్యం లేకుండా ఇళ్లను నిర్మించుకోవటం, అద్దెలకు ఇవ్వటంతో పార్కింగ్ సమస్య ఏర్పడుతున్నది. ఒక్కో ఇళ్లు 60-80 గజాల్లో నాలుగు నుంచి అయిదు అంతస్తుల వరకు నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో ఇంటిలో సుమారు 5 నుంచి 8 ద్విచక్ర వాహనాలు, కార్లు ఉండటంతో ఇళ్లముందు, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయటంతో గొడవలు జరుగుతున్నాయి. వాహనం ఎవరిదో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. అకస్మాత్తుగా ఎవరికైనా అనారోగ్యం వస్తే 108కు ఫోన్ చేసినా వాహనం రాలేని పరిస్థితి. సొసైటీ నిర్వాహకులు సొసైటీ మీటింగ్‌ల సమయంలో పార్కింగ్ లేని వారు కిరాయిదారులకు పార్కింగ్ సమస్య ఉంటుందని తెలియచేయాలని సూచించినప్పటికి పట్టించుకోకుండా కిరాయికి ఇవ్వటం సమస్య జఠిలంగా మారుతోంది. గతంలో కూకట్‌పల్లి, వివేకానందనగర్ డివిజన్‌ల పరిధిలోని పాపిరెడ్డినగర్, వెంకటేశ్వరనగర్, రిక్షా పుల్లర్స్ కాలనీలో గర్భవతుల కోసం అంబులెన్స్ రాలేక ఇక్కట్లు పడినట్లు బాధితులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు, జీహెచ్‌యంసి ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. అంబులెన్స్, ఫైర్ ఇంజన్ వంటి వాహనాలకు దారి ఇచ్చే విధంగా పార్క్ చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అత్యవసర వాహనాలు రాలేని పరిస్థితి



రాత్రి వేళల్లో ఇళ్లముందు, రహదారులపై ద్విచక్ర వాహనాలు, కార్లు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయటంతో అంబులెన్స్, ఫైర్ ఇంజన్ వంటి అత్యవసర వాహనాలు రాలేని పరిస్థితి. అనారోగ్య సమస్య వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఇంటి యజమానులు పార్కింగ్ సమస్య లేకుండా చూసుకోవలసిన అవసరం ఉంది. పోలీస్ ఉన్నతాధికారులు ప్రతి కాలనీలో అవగాహన కల్పించాలి. -విక్కీ, స్థానికుడు